RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 316 | మంగళవారం | 21 - 05 - 2024 | పేజీలు : 4 | వెల : 5.00

## రేవ్ పార్టీ కలకలం



3

### 2028 కోసం బీజేపీ
## వ్యూహాత్మక అడుగులు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు అన్ని పార్టీలకు అత్యంత కీలకంగా మారాయి. ఎందుకంటే లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రభావం ప్రభుత్వ మనుగడపై ఉంటుందన్న చర్చ ఎక్కువగా ఉండటమే. కాంగ్రెస్ కన్నా బీజేపీకి ఎక్కవ సీట్లు వస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఏ మాత్రం సహించని బీఆర్ఎస్ చీఫ్ భావిస్తున్నారు.

2

### 80 కోట్ల స్థలం
## కబ్జాకు యత్నం



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : ఎర్రగడ్డ డివిజన్లోని బోరబండ ప్రాంతంలో ఉండే సారధి నగర్ లో ఎకరా ప్రభుత్వ

3

# పీసీసీ రేసులో.. ఉత్కంఠం

- ఆశల పల్లకిలో పలువురు నేతలు
- రేవంత్ టీపీసీసీ బాధ్యతలను వేరొకరికి అప్పగిస్తారని ప్రచారం





హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల సంగ్రామం ముగిసింది. జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తరువాత తెలంగాణ పీసీసీ చీఫ్ మార్పు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్రంలో అధికార పీఠం ఎవరికి దక్కనుందో జూన్ 4న తేలనుంది. ఆ తర్వాత కాంగ్రెస్ హై కమాండ్ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే విషయంలో దృష్టి సారిస్తుందని నేతలు చెబుతున్నారు. పీసీసీ చీఫ్ గా జూన్ 26, 2021 లో రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. అప్పటి నుండి రేవంత్ రెడ్డి సారధ్యంలో శాసన సభ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంది. జీరోగా ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీనీ అధికారంలోకి తేవడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతమయ్యారు. వెంటనే

2

# ప్రభాత సూర్యుడు ఎఫెక్ట్




## ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలు కూల్చివేత

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు : ప్రభాత సూర్యుడు దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన '2 కోట్ల ప్రభుత్వ భూమి హాంఫట్' కథనానికి రెవిన్యూ అధికారులు స్పందించారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 422 ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మించిన అక్రమ షెడ్డును మండల తహసిల్దార్ రవీంద్ర దత్తు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా రవీంద్ర దత్తు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేసి నా, అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా పెడతామని హెచ్చరించారు.

### కార్మికుల మద్దతుతో
## పి. వెంకట్రామి రెడ్డి గెలుపు పక్కా



**– ప్రభాత సూర్యుడు చీఫ్ ఎడిటర్ కస్బా శంకర్ రావు ప్రత్యేక ఇంటర్వ్యూలో కార్మిక శివశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ నర్రా బిక్షపతి పటేల్**


మెదక్ – ప్రభాత సూర్యుడు : పారిశ్రామిక ప్రాంత కార్మికుల, ప్రజల మద్దతోనే మెదక్ పార్లమెంటు నియోజకవర్గం బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాజీ కలెక్టర్ పి. వెంకట్రామి రెడ్డి గెలుపు పక్కా అని కార్మిక శివశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ నర్ర బిక్షపతి పటేల్ అన్నారు. సోమవారం ప్రభాత సూర్యుడు చీఫ్ ఎడిటర్ కస్బా శంకర్రావు తో మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాలైన పాశమైలారం, పఠాన్ చెరువు, బొంతపల్లి, బొల్లారం, కాజు పల్లి, బీహెచ్ఈఎల్ సుల్తాన్పూర్, తదితర ప్రాంతాల కార్మికులు కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రధానమంత్రి మోడీ కి వ్యతిరేకంగా కార్మికుల ఐక్యమత్యంతో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్మిక విధానాలను నిరసిస్తూ మొన్న జరిగిన మెదక్ పార్లమెంటు బి ఆర్ ఎస్ అభ్యర్థి గెలుపుకై మద్దతు తెలుపుతూ గంపగుత్త గా కార్మిక లోకం మాజీ కలెక్టర్ పి వెంకట్రామారెడ్డి కి అనుకూలంగా ఓట్లు

2

# పీసీసీ రేసులో ఉత్కంఠం

పార్లమెంట్ ఎన్నికలు రావడంతో రేవంత్ సారథ్యంలోనే మళ్లీ సార్వత్రిక ఎన్నికలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగింది. ఆయా సర్వేలు చెప్పినట్లు రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకుంటుందన్న నమ్మకంలో హస్తం నేతలు ఉన్నారు. సారథ్య బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి తనదైన దూకుడుతో రేవంత్ రాజకీయాలు సాగించారు. వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ పార్టీని గద్దె దింపే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లోను మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని కాంగ్రెస్ అగ్రనాయకత్వం నమ్మకంతో ఉంది. ఇక రాష్ట్ర పాలనా వ్యవహారాలపై రేవంత్ పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించేలా, వెసులుబాటు కల్పించేందుకు గాను టీపీసీసీ బాధ్యతలను వేరొకరికి అప్పగిస్తారని ప్రచారం సాగుతోంది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశాలను పరిశీలిస్తున్నారు. అధిష్టానంతో దగ్గర సంబంధం ఉన్న నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉంది. ముఖ్యమంత్రితో కలుపుకుని రాష్ట్ర క్యాబినెట్ సంఖ్య 18 ఉండాలి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి సహా 12 మంది క్యాబినెట్లో ఉన్నారు. మిగిలిన ఆరు ఖాళీలను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే దీని మీద అధిష్టానానికి ఓ క్లారిటీ ఉందని, సామజిక వర్గాలవారీగా, జిల్లాల వారీగా ప్రాతినిధ్యం ఇచ్చే రీతిలో మిగిలిన ఆరు స్థానాలను భర్తీ చేస్తారని కాంగ్రెస్ సీనియర్ నేతలు చెబుతున్నారు. ఈ తంతు ముగియగానే.. పీసీసీ సారథ్య బాధ్యతలను రేవంత్ రెడ్డి నుంచి తప్పించి పూర్తిగా పాలనపై దృష్టి సారించేలా వెసులుబాటు కల్పిస్తారని చెబుతున్నారు.


కొత్త పీసీసీ చీఫ్ గా సీనియర్ నేతకు అవకాశం దక్కుతుందంటున్నారు. ఈక్రమంలో ఇప్పటికే ఆయా సామాజిక వర్గాల నుంచి కీలక నేతలు తమ వంతు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేతలను కలిసినప్పుడల్లా తమ సీనియారిటీనీ, పార్టీ సేవలను, అధిష్టానం పట్ల



మొదటిపేజీ తరువాయి

తమ విధేయతను ప్రకటిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే పీసీసీ చీఫ్ రేసులో మంత్రి భట్టి విక్రమార్క సహా, ప్రస్తుత పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే సంపత్, మధుయాష్కీ గౌడ్, మహేష్ కుమార్ గౌడ్ వంటి నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే అధిష్టానం ఎవరికి అభయహస్తం ఇస్తుందో మాత్రం వేచి చూడాల్సిందే. పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి వందకు వంద శాతం సక్సెస్ కావడంతో ఆ తర్వాత పగ్గాలు స్వీకరించే నేత కుడా ఆ మేరకు సామర్థ్యంగల వ్యక్తే ఉండాలన్నది అధిష్టానం యోచనగా పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. అంతే కాకుండా గాంధీ కుటుంబం పట్ల విధేయత తప్పనిసరి అర్హతగా కాంగ్రెస్ చరిత్ర తెలిసిన వారు ఎవరయినా చెబుతారు. అంతే కాకుండా.. ఏ సామాజిక వర్గానికి ఈ దఫా అవకాశం ఇస్తారా అన్నది కూడా పార్టీ లో ఉత్కంఠకు తెరలేపుతోంది. పీసీ చీఫ్ గా ఎస్సీ సామాజిక వర్గం నుండి అవకాశం ఇస్తారా.. లేక బీసీల నుండి అవకాశం ఇస్తారా అన్న చర్చ సాగుతోంది. లేదంటే... ఓసీల నుండి అంటే రెడ్డి సామాజిక వర్గానికే మళ్లీ ఆ పీఠం దక్కుతుందా అన్న అంశంపైన పార్టీలో చర్చలు సాగుతున్నాయి. ఏది ఏమైనా... వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్ ను మరింత పటిష్టం చేసే కార్యచరణలో భాగంగానే పీసీసీ పీఠం సమర్థుడైన వ్యక్తికి దక్కుతుందని, ఇప్పటికే అన్ని రకాలుగా పార్టీ హైకమాండ్ ఈ విషయంలో తనకు కావాల్సిన సమాచారం సేకరించిందని హస్తం నేతలు చెబుతున్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి ఎవరికి ఓటు వేస్తారా అన్న విషయం పైన చర్చలు సాగుతున్నాయి. అటు ప్రభుత్వం ? ఇటు పార్టీ సమన్వయంతో నడవాలంటే.. రేవంత్ రెడ్డికి సహకరించే వ్యక్తే పీసీసీ చీఫ్ గా ఉండవచ్చని.. ఈ అంశం కూడా పీసీసీ చీఫ్ ఎంపికలో ప్రధాంగా మారవచ్చన్న ఉహాగానాలు వెలువడుతున్నాయి. అటు సోనియా గాంధీ సహా, రాహుల్, ప్రియాంకలతో రేవంత్ కున్న సంబంధాల దృష్ట్యా ఈ ఎంపికలో రేవంత్ పాత్ర ప్రముఖంగా ఉండవచ్చని చెబుతున్నారు. ఏది ఏమైనా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత పీసీసీ చీఫ్ మారడం ఖాయమని... స్థానిక సంస్థల ఎన్నికలకు కొత్త సారథి నేతృత్వంలోనే తెలంగాణ కాంగ్రెస్ వెళ్లనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. ఈ కారణంగా ఇప్పటి నుండే... పార్టీ అగ్రనేతల కనుసన్నల్లో పడేందుకు ఆశావాహులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పార్టీ ముఖ్య పదవిని దక్కించుకునేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు.

# కార్మికుల మద్దతుతో పి. వెంకట్రామి రెడ్డి గెలుపు పక్కా




మొదటిపేజీ తరువాయి

వేసినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆశీస్సులు, సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి, హరీష్ రావు యొక్క ఎన్నికల వ్యూహం, పటాన్ చెరువు ఎమ్మెల్యే, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రస్తుత పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పటాన్ చెరువు మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్, కే శంకర్ యాదవ్ పటాన్ చెరువు మాజీ, ఎంపీపీ మాజీ కార్పొరేటర్, సర్పంచ్ మందుమూల సపానదేవ్, మాజీ కార్పొరేటర్, మాజీ సర్పంచ్ ఎం. దేవేందర్ రాజు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ సర్దన కిషన్ ల సమిష్టి కృషి తో మెదక్ పార్లమెంట్ బి ఆర్ ఎస్ అభ్యర్థి గా పోటీ చేసిన మాజీ కలెక్టర్ పి.వెంకట్రామారెడ్డి గెలుపు తధ్యమని అన్నారు.

ఈ పెద్దల అందరి తోడ్పడుతోపాటు పారిశ్రామిక కార్మికులు కసిగా బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి ఓట్లు వేసి కార్మిక శక్తి నిరూపించుకున్నారని అన్నారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీ ల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు లేనిపోని అపోహలు సృష్టించి గత అసెంబ్లీ ఎన్నికలలో అధికారంలోకి వచ్చారని అన్నారు. ఐదు నెలల కాలంలోనే కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని అన్నారు ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను ఆరు చెరువుల నీరు తాపుతున్నారని అన్నారు రెండు లక్షల రుణమాఫీ చేయలేక కనపడ్డ ప్రతి దేవుళ్ళపై ఒట్టు వేసి ఆగస్టు 15 లోపల రెండు లక్షలు రైతులకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను నమ్మబలికి పార్లమెంటే ఎన్నికల్లో మరొక్కసారి రైతులను మోసం చేశారని అన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం పై ఘాటుగా స్పందిస్తూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ప్రజలకు అష్ట కష్టాలు పెడుతున్న మోదీ ప్రభుత్వానికి ఈసారి ప్రజలు తగు గుణపాఠం చెపుతారని అన్నారు. ప్రైవేటీకరణ పేరుతో భారత రైల్వేలు, భారత పోస్టల్, భారత షిప్పియార్డులు, భారత పౌర విమానయానం, ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ ఉక్కు కర్మాగారం, బిహెచ్ఎల్, బీడీఎల్, అంతర్జాతీయ ఫార్మసీరంగంలో గుర్తింపు తెచ్చుకున్న ఫార్మసీ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తూ ప్రైవేటీకరణ పేరుతో అంబానీ ఆధానీలకు అప్పజెప్పుతున్నారని అన్నారు. భారత కార్మిక వర్గాన్ని నిట్ట నిలువగా దోపిడీ చేస్తున్న కార్మిక వ్యతిరేక బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో కార్మిక వర్గం తగిన గుణపారం చూపిస్తారని ఘాటుగా అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం లోని పారిశ్రామిక ప్రాంతాలైన పటాన్చెరు పాశమైలారం బొల్లారం కాజ పల్లి బీహెచ్ఈఎల్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తదితర పబ్లిక్ సెక్టార్ కంపెనీలు, ప్రైవేట్ కంపెనీల కార్మిక వర్గం మొత్తం భారతీయ జనతా పార్టీ కి వ్యతిరేకంగా బి.ఆర్.ఎస్ కు అనుకూలంగా ఓటు వేసి కార్మికులు తమ విజ్ఞతను నిరూపించుకున్నారని తెలిపారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్రమంత్రి అమిత్ షాలు ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఎన్నికల బహిరంగ సభల్లో అనడంతో ముస్లిం మైనార్టీ సహోదరులు, కార్మికపక్షాలు గంపగుత్తగా మాజీ కలెక్టర్ పి వెంకట్రామారెడ్డికి గెలుపుకై పరోక్షంగా సహకరించారని అన్నారు. అందరి మద్దతుతో మెదక్ పార్లమెంటు నియోజకవర్గం నుండి మాజీ కలెక్టర్ మెజారిటీ ఓట్లతో గెలవబోతున్నట్లు లెక్కలతో సహా చెప్పారు. చెప్పారు. మెదక్ పార్లమెంటు సీటు బి ఆర్ ఎస్ పార్టీ గెలుచుకొని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

# 2028 కోసం బీజేపీ వ్యూహాత్మక అడుగులు



మొదటిపేజీ తరువాయి

ఇదే విషయాన్ని చాలా సార్లు చెప్పారు. బీఆర్ఎస్ తరపున బీజేపీకి ఈ విషయంలో సాయం చేశారన్న గుసగుసలు కూడా గట్టిగానే వినిపిస్తున్నాయి. కొన్ని స్థానాల్లో బలహీన అభ్యర్థులను పెట్టడం.. కొన్ని స్థానాల్లో పెద్దగా ప్రచారం చేయకపోవడం వంటి వ్యూహాల ద్వారా బీజేపీకి మేలు చేశారని అంటున్నారు. కానీ ఇది బీజేపీతో ఒప్పందం చేసుకుని చేసింది కాదని .. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ సొంత రాజకీయమన్న అభిప్రాయం ఎక్కువగా ఉంది. ఎందుకంటే.. రేవంత్ సర్కార్ ను టార్గెట్ చేయడం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుండి ఆ ప్రభుత్వం ఉండదని పదే పదే అభిప్రాయం చెప్పేవారే ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు. ఎలా జరుగుతుందో కూడా విశ్లేషించేవారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు పరిమితంగా సీట్లు వస్తాయని.. ఆ తర్వాత బీజేపీ ఆ ప్రభుత్వాన్ని పడగొట్టేస్తుందని అంచనాలు వేస్తూ వచ్చారు. కేసీఆర్ కూడా తమ పార్టీ సమావేశాల్లో ఇవే చెబుతూ వచ్చారు. వందకుపైగా ఎమ్మెల్యేలు ఉన్న తన ప్రభుత్వాన్నే కూల్చేందుకు బీజేపీ నేతలు ప్రయత్నించారని కాంగ్రెస్ కు సహించే ప్రశ్నే ఉండదని ఆయన అభిప్రాయం. ఈ పరిస్థితి తీసుకు రావడానికి ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో కేసీఆర్ బీజేపీకి సహకరిస్తున్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిందని తేల్చేందుకు బీజేపీకి సైలెంట్ గా సపోర్టు చేశారని. ఫలితంగా కాంగ్రెస్, బీజేపీ మధ్య గట్టి పోరాటం లోక్ సభ ఎన్నికల్లో జరిగిందని అంటున్నారు. కాంగ్రెస్ కన్నా బీజేపీకి ఒక్క సీటు ఎక్కువగా వస్తే అసలు కథ ప్రారంభమవుతుందని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ భావిస్తున్నారని అనుకోవచ్చు. బీఆర్ఎస్ ప్లాన్ ప్రకారం.. బీజేపీ ఎక్కువ సీట్లు సాధిస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేసి.. బీఆర్ఎస్ తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కేసీఆర్ అనుకుంటున్నారు. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కూడా ఆకర్షించాలి. అలా చేసినా బీఆర్ఎస్ సాయంతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. చెడ్డ పేరు అంతా బీజేపీకి వస్తుంది. కానీ అధికారంలో బీఆర్ఎస్ కు భాగస్వామ్యం లభిస్తుంది. కేసీఆర్ ఇదే ఆలోచించారని అంటున్నారు. కానీ బీజేపీ ఈ విషయంలో అంత తేలికగా కేసీఆర్ ట్రాప్ లో పడే అవకాశం ఉండదని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కన్నా ఎక్కువ సీట్లు వస్తే తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకునే ప్రయత్నం బీజేపీ చేస్తుందని.. ఉన్న పళంగా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూలగొట్టేసి.. ఆ పార్టీతో కలిసి అధికారం చేపట్టాలని అనుకోకపోవచ్చనని చెబుతున్నారు. బీజేపీ ప్రథమంగా బీఆర్ఎస్ పైనే దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ఉనికిని వీలైనంతంగా పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తుంది. కిషన్ రెడ్డి కూడా అదే చెబుతున్నారు . వచ్చే ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉనికి ఉండదని అంటున్నారు. ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ కనీస బలం చూపించలేకపోతే ముఖ్యంగా గట్టి ఓటు బ్యాంక్ ను కాపాడుకోలేకపోతే మొదటికే మోసం వస్తుంది.

ఆ పార్టీకి చెందిన క్యాడర్ ను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పంచుకుంటాయి. ఎక్కువగా బీజేపీ పంచన చేరిపోతారు. ఎందుకంటే.. మరో రెండు, మూడేళ్ల తర్వాత అయినా కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా నిలబడే పార్టీగా బీజేపీనే చూస్తారు. అందుకే ఆ పార్టీలో చేరిపోతారు. బీఆర్ఎస్ బలహీనపడుతుంది. క్రమంగా బీఆర్ఎస్ స్థానాన్ని బీజేపీ ఆక్రమిస్తుంది. ఎమ్మెల్యేల చేరికలతో అసెంబ్లీలోనూ ప్రతిపక్ష స్థానానికి చేరుతుంది బీజేపీ. తాము బలపడేందుకు అయినా.. బీఆర్ఎస్ పార్టీని బలహీనం చేసేందుకు తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్న పరిస్థితి ఉన్నట్లుగా తెచ్చేందుకు ప్రధానంగా కొంత కాలం అయినా కాంగ్రెస్ ప్రభుత్వం జోలికి వచ్చేందుకు బీజేపీ సిద్ధపడదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల కారణంగా ఇవాళ కాకపోతే రేపైనా ప్రజలు ప్రభుత్వంపై తిరుగబడతారన్న భావన బీజేపీలో ఉంది. ఎంత అసంతృప్తి చెందితే బీజేపీకి అంత మేలు జరుగుతుంది. ఇంత కాలం అన్ని పార్టీలకు చాన్సిచ్చారు.. బీజేపీకి ఒక్క చాన్స్ ఇవ్వమని అడగితే.. ప్రజలు స్పందించే అవకాశం ఉంది. అందుకే పార్లమెంట్ ఎన్నికల తర్వాత అందరూ ఊహించుకుంటున్నట్లుగా బీజేపీకి అత్యధిక సీట్లు వచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే ఢోకా ఉండదు. కానీ బీఆర్ఎస్ కు మాత్రం బీజేపీ నుంచి పెను సవాళ్లు ఎదురు కానున్నాయి.

## ఎడిటోరియల్ EDITORIAL

### డిజిటల్ యుగంలో కొలతలే అభివృద్ధికి సూచికలు..!

ప్రభాత సూర్యుడు, డెస్క్ : బరువు చూడాలన్నా, ఎత్తు కొలవాలన్నా, బిల్లు కట్టాలన్నా, డబ్బు లెక్కించాలన్నా, కరోనా పరీక్ష చేయించాలన్నా, కూరగాయలు కొనాలన్నా, నూనె తీసుకోవాలన్నా, బిపి/పల్స్/ఉష్ణోగ్రత /మధుమేహ వివరాలు తెలుసుకోవాలన్నా, ఫలసాయం అమ్మాలన్నా, కిరాణ సరుకులు/చెప్పులు/బట్టలు కొనాలన్నా, పెట్రోల్ నింపుకోవాలన్నా, గ్యాస్ కొనాలన్నా, ఒకటేమిటి ఏ కార్యం చేసినా, ఏది కొన్నా, ఏది అమ్మినా కొలతలు లేకుండా ఏ పని చేయడం సాధ్యపడదు. ఇలాంటి కొలతల ప్రాధాన్యతను గుర్తించిన 17 దేశాల అంతర్జాతీయ సమాజం 20 మే 1875న 'మీటర్ సదస్సు'ను నిర్వహించడం జరిగింది. ఘన, ద్రవ, వాయు పరిమాణాలను నిర్ణయించడానికి కొలతలు వినియోగించబడుతాయి. వైజ్ఞానిక సాంఘీక శాస్త్ర విభాగాలన్నీ కొలతల మీదనే ఆధారపడి ఉంటాయి. పారిశ్రామిక, పరిశోధనలు, ఆర్థిక లావాదేవీలు, కాలుష్య అంచనాలు, ఔషధ డోసులు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ వాణిజ్య, వ్యాపారాల్లో ప్రపంచ దేశాలన్నీ ఏకరూప యూనిట్లపై ఏకాభిప్రాయానికి రావాలని ఈ సదస్సులో తీసుకున్న తీర్మానం నేటికీ సముచితంగా, అనుసరణీయంగా ఉన్నది. ఈ సదస్సు తీర్మానానికి గుర్తుగా ప్రతి ఏటా 20 మే రోజున 'ప్రపంచ కొలతలశాస్త్ర దినం (వరల్డ్ మెట్రాలజీ డే)' నిర్వహించుట జరుగుతోంది.

ఈ ఏడాది ప్రపంచ కొలతల దినం – 2024 నినాదంగా 'నేటి సరైన తూనికలు, కొలతలతోనే సుస్థిర భవిత' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. ఆరోగ్య పరిరక్షణ ప్రక్రియల్లో కొలతల ప్రాధాన్యత అనంతం. కొలతలశాస్త్ర వినియోగంతోనే ఆరోగ్యం సిద్ధిస్తూ, సుఖజీవనానికి దారి తీస్తుంది. జీవన ప్రమాణాలు పెరగడానికి, పర్యావరణ పరిరక్షణకు కొలతలు పునాదులుగా మారాయని మరువరాదు. 'ప్రపంచ కొలతలశాస్త్ర దినం' వేదికగా మన ఆరోగ్య పరిరక్షణ, జీవన ప్రమాణాల పెరుగుదలలో కొలతల ప్రాధాన్యతలను సాధారణ జనానికి వివరించడం జరుగుతుంది. కరోనా మహమ్మారి సంక్షోభ సమయంలో కూడా వైరస్ వ్యాప్తి, నిర్ధారణ పరీక్షలు, కేసులు, రికవరీలు, పాజిటివిటీ రేటు, మరణాల రేటు లాంటి విలువైన సమాచారం కొలతలశాస్త్రంతో మాత్రమే జరిగిందని తెలుసుకోవాలి. నేటి అత్యాధునిక డిజిటల్ యుగంలో కొలతలశాస్త్రం ప్రధాన భూమికను నిర్వహిస్తోందని నమ్మాలి. నేడు ప్రపంచవ్యాప్తంగా యస్ఐ యూనిట్లు ఏకరూప ప్రమాణాలుగా పొడవును మీటర్లు, కాలాన్ని సెకన్లు, ద్రవ్యరాశిని కిలోగ్రామ్‌లు, ఉష్ణోగ్రతను డిగ్రీ కెల్విన్లు, పదార్థ పరిమాణాన్ని మోల్‌లు, ఎలక్ట్రిక్ కరెంట్‌ను ఆంపియర్లు, ల్యూమినస్ ఇంటెన్సిటీని కాండెలా యూనిట్లలో సూచించడం జరుగుతున్నది.

భారతదేశంలో చేసిన 'లీగల్ మెట్రాలజీ ఆక్ట్, 2009' చట్టం ప్రకారం అమ్మకాలు, కొనుగోలు సందర్భాలలో తూనికలు, కొలతల ప్రాధాన్యత చాలా ఉంటుంది. కొలతల్లో మోసాలు, నకిలీ వస్తువులు, ఆహార కల్తీలు లాంటి వినియోగదారులకు జరిగే అన్యాయాలను నియంత్రించడానికి లీగల్ మెట్రాలజీ శాఖ ఏర్పాటు చేయడం జరిగింది. వాతావరణంలో ప్రతికూల మార్పులు, కరువుకాటకాలు, అకాలవర్షాలు, వడగాలులు విపరీతాలు, ఆహార కొరత, ఆహార వృధాలు, పోషకాహార అభద్రత లాంటి సమస్యలు నేడు ప్రపంచ మానవాళి భవితను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నిరుపేద నుంచి కుబేరుల వరకు అందరి జీవితాల్లో తూనికలు, కొలతల ప్రాధాన్యం ఉంటుందని గమనించి మార్కెట్ మోసాలను గుర్తిస్తూ, సరైన మార్గంలో అరికడుతూ, మోసాలు/కల్తీలు/నకిలీ వస్తువుల మాయాజాలాలకు వ్యతిరేకంగా పోరాడవలసిన అగత్యం ఏర్పడింది. ఈ విషయంలో ఏమరుపాటు ప్రజారోగ్యం, ఆర్థిక స్థితులపై తీవ్ర ప్రభావాన్ని చూపనుందని గమనించాలి. నిత్య జీవితంలో ఏ వస్తువులు కొన్నా, అమ్మినా సరైన కొలతలు ఉండేలా కొనుగోలుదారులు, అమ్మకం దారులు జాగ్రత్త పడాలి. కొలతల్లో మోసాలను అరికడుతూ, ఆనందమయ జీవితాలకు కొలతలను పునాదులుగా చేసుకుందాం. సరైన కొలతలకు విలువ ఇద్దాం, 810 కోట్ల ప్రపంచ జనుల ప్రాణాలు కాపాడుతుందాం.

# వరంగల్ కు ఎయిర్ పోర్టు




వరంగల్, ప్రభాత సూర్యుడు : దశాబ్దాలుగా వరంగల్ వాసులు ఆశగా ఎదురు చూస్తున్న కల నెరవేరనుంది. వరంగల్ విమానాశ్రయం నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తరవాత వరంగల్ విమానాశ్రయం వ్యవహారాలపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వరంగల్ ప్రాంతీయ విమానాశ్రయం విషయంలో కొంతకాలంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ సైలెంట్‌గా ఉంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో మాట్లాడుతూ.. వరంగల్ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. దీంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై ఏఏఐ అధికారుల్లో కదలిక వచ్చింది. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సమీక్షించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం త్వరలో రాష్ట్రానికి రానున్నట్లు తెలుస్తోంది. వరంగల్‌లో ప్రస్తుతం ఎయిర్ స్ట్రిప్‌ను పరిశీలించి, ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహించనున్నట్లు సమాచారం. అప్పుడు ఎయిర్ పోర్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమా? లేక మునుపటి ప్రభుత్వం నిర్ణయం ప్రకారం దశల వారీగా అభివృద్ధి చేస్తారా అనేది తేలనుంది. వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి 706 ఎకరాల భూమిని కేటాయించారు. దానికి అదనంగా మరో 253 ఎకరాలు కేటాయిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్‌కు ముందు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు హైదరాబాద్ జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కూడా అనుమతులు తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వం నుంచి వచ్చిన భూమి కేటాయింపు ఉత్తర్వులతో ఏఏఐ అధికారులు వరంగల్‌లో పర్యటించారు. విమానాశ్రయం నిర్మాణం, అక్కడి పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. దాని తరువాత ఏఏఐ అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఎలాంటి సమాచారం లేదు. దీంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై అయోమయం నెలకొంది. విమానాశ్రయ నిర్మాణం కోసం పరిశీలన చేశారా? లేక మరేదైనా కారణాలతో సర్వే చేశారా? అనే విషయంపై ప్రస్తుత ప్రభుత్వానికి స్పష్టత రావాల్సి ఉంది. వరంగల్ విమానాశ్రయాన్ని దశల వారీగా విస్తరించాలని గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఏటీఆర్ స్థాయి చిన్న విమానాల రాకపోకలు సాగించేలా ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనుకున్నారు. ఇందు కోసం 253 ఎకరాలను కేటాయించింది. అయితే ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కనీసం 400 ఎకరాలు కావాలని ఏఏఐ అధికారులు తమ నివేదికలో వెల్లడించారు. అలాగే విస్తరణకు సుమారు రూ.1,200 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే అంత మొత్తాన్ని ఖర్చు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ సమయంలో ఆసక్తి చూపలేదని ఏఏఐ అధికారులు తెలిపారు.అయితే వరంగల్ విమానాశ్రయంలో రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్లతో విమానాల రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని, ఇందుకు అణుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సూచించింది. కానీ దానిని నిపుణులు వ్యతిరేకించారు. ఒకేసారి నిర్మాణాన్ని చేపడితే అన్ని రకాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆ విషయం కాస్తా అటకెక్కింది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి స్పందించడంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణం అంశం తెరపైకి వచ్చింది. విమానాశ్రయ నిర్మాణానికి రేవంత్ సర్కార్ సుముఖత వ్యక్తం చేసినా అది ఏ స్థాయిలో ఉంటుందో తెలియాల్సి ఉంది.

# ఆ ముగ్గురు ఎమ్మెల్యేల కథేంటీ

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : బిజెపికి సంబంధించిన ముగ్గురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో భేటీ అవ్వడంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి,ముధోల్ శాసనసభ్యులు రామారావు పటేల్ ఆదివారం రేవంత్ ను కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో మంత్రివర్గ సమావేశం నిర్వహణకై ఈసీ పర్మిషన్ కోసం వెయిట్ చేస్తుండగా.. ఈ ముగ్గురు ఆయనతో భేటీ అయ్యారు. పలు రైతు సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్ కు రిప్రెజెంటేషన్ ఇచ్చారుపైకి ముగ్గురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని రైతు సమస్యల పరిష్కారం కోసం కలిసినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికిని అంతర్గతంగా మాత్రం రాజకీయ వర్గాల్లో మరో రకమైన డిస్కషన్ నడుస్తుంది. బిజెపికి సంబంధించిన ఈ ముగ్గురు ఎమ్మెల్యేలకు గతంలో కాంగ్రెస్తో అవినాభావ సంబంధం ఉంది. బిజెపి శాసనసభా నేతగా ఉన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎన్నికలకు ఆరు నెలల ముందు కాంగ్రెస్ నుంచి బిజెపి పార్టీలో జాయిన్ అయి నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అందువల్ల ఆయన ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తులతో కూడా నిరంతరం టచ్ లో ఉంటారనే ప్రచారం ఉంది. ఇక మరో ఎమ్మెల్యే రామారావు పటేల్ కు కూడా ఇదే నేపథ్యముంది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గతంలో రాజకీయంగా అంతగా ఆక్టివ్ గా లేని వ్యక్తి. కానీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషయంలో మాత్రం ఆయన ఎప్పుడూ నెగటివ్ గా స్పందించిన సందర్భాలు లేవు. ఈ ముగ్గురు బిజెపి ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డి తో సచివాలయంలో సమావేశం వెనక పార్టీ మార్పు ఉండొచ్చనే చర్చ నడుస్తుంది. వాస్తవానికి రైతు సమస్యలపై గనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బిజెపి తరఫున వినతి పత్రాలు అందించాలనుకుంటే.. ఆ పార్టీ శాసనసభ పక్షం హోదాలో ఉన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి పార్టీలోని మిగతా ఎమ్మెల్యేలు అందరికీ సమాచారం ఇవ్వాల్సింది. అలా కాదనుకుంటే రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ బహిరంగ లేఖ రాసినా సరిపోయేది. కానీ,ఇక్కడ అలా జరగలేదు. టీ-బీజేపీ శాసనసభా పక్ష హోదాలో ఉన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి మిగతా ఎమ్మెల్యేలందరికీ సమాచారం అందించనట్టు తెలుస్తోంది. అందువల్లే ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి ని కలవడం వెనక పార్టీ మార్పే మెయిన్ రీజన్ అయ్యి ఉంటుందనే డిస్కషన్ జరుగుతోంది.

# రైతుల ఎదురుచూపులు

నిజామాబాద్, ప్రభాత సూర్యుడు : పంటలు సాగు చేసిన రైతులను.. దంచి కొడుతున్న వానలు నట్టేట ముంచాయి. నోటి కాడి బుక్క నీటిపాలడంతో దిగులుతో తలలు పట్టుకున్నారు. మరోవైపు తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. అకాల వర్ష బీభత్సంతో వరి పంటకు ఊహించని విధంగా నష్టం వాటిల్లింది. వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వరి పంట మొత్తం వర్షార్పణమైంది. ఇప్పటికే కోతలు పూర్తయి అమ్మకం కోసం చాలా ప్రాంతాల్లో ధాన్యం ఆరబోసుకొని అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. వానల నుంచి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి ఉంది. అయితే ఆరబోసిన ధాన్యం తడవడంతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిశీలన చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.మరోవైపు సిరిసిల్ల జిల్లా వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని వేములవాడ అర్బన్ మండలం అనుపురం ప్రధాన రహదారిపై రైతుల ఆందోళనకు దిగారు. వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిందని.. 15 రోజులు గడుస్తున్నా లారీలు రావట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215